నమస్తే తెలంగాణ
ఆదిలాబాద్
5 | నిజామాబాద్, శనివారం 23 మార్చి 2024 | ADILABAD

## గిరిజన విద్యాభివృద్ధికి కృషి

**ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా**



మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా

ఉట్నూర్, మార్చి 22: గిరిజన గ్రామాల్లో విద్యాభివృద్ధికి కృషి చేస్తున్నట్లు ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా తెలిపారు. స్థానిక కుమ్రం భీం ప్రాంగణంలో బాల సాహిత్యంను తెలుగు నుంచి గోండి, కొలాం భాషలోకి అనువాదం చేసే మూడు రోజుల క్యాంప్‌ను శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గోండి, కొలాం అనువాదంతో గిరిజన విద్యార్థులు సంతోషంగా పాఠశాలలకు వచ్చి విద్యను నేర్చుకుంటారన్నారు. వారికి అర్థమయ్యే రీతిలో ఈ అనువాదం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో డీడీ దిలీప్ కుమార్, బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్ మనోహర్, రూమ్ టూ రీడ్ ప్రతినిధులు ప్రవీణ్, సాయి హర్ష, అజీత్, గోండి కోఆర్డినేటర్ దేవ్‌రావు, కొలాం కో ఆర్డినేటర్ యశ్వంత్‌రావు, గోండి, కొలాం అనువాద ఉపాధ్యాయులు మోతీరాం పాల్గొన్నారు.

## పుట్టగొడుగుల సాగుపై అవగాహన



తయారు చేసిన పుట్టగొడుగులతో మహిళా సంఘం సభ్యులు

దిలావర్‌పూర్ మార్చి 22: మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో మహిళా సంఘులకు పుట్టగొడుగుల సాగుపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఇంటర్‌ప్రెన్యూర్ డెవలప్‌మెంట్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో శిక్షణ తరగతులు నిర్వహించినట్లు ఐకేపీ ఏపీఎం సులోచనారెడ్డి తెలిపారు. ఈ తరగతులకు ఆసక్తి గల మహిళ సంఘాల సభ్యులు హాజరవ్వాలని కోరారు. మహిళా సం ఘాల సభ్యులు ఇంటి వద్ద తీరిక సమయంలో కొద్ది పాటి స్థలంలోనే పుట్టగొడుగులను సాగు చేసి, ఆర్థిక పరిపుష్టి సాధించవచ్చని తెలిపారు. ఈడీఐఐ ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ సంతోష్ కుమార్ మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.



నాగోబా ఆలయంలో పూజలు చేస్తున్న బీఆర్‌ఎస్ పార్టీ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు

## నాగోబాకు ఎంపీ అభ్యర్థి పూజలు

ఇంద్రవెల్లి, మార్చి 22: మండలంలోని కెస్లాపూర్ నాగోబా ఆలయాన్ని బీఆర్‌ఎస్ పార్టీ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు శుక్రవారం దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. నాగోబా జాతరతోపాటు వివిధ అంశాలపై మెస్రం వంశీయులతోపాటు నాయకులతో చర్చించారు. ఈ సందర్భంగా ఆయనను మెస్రం వంశీయులు, నాయకులు శాలువాతో సన్మానించారు. మండలంలోని సమక మహారాజ్ కోరెంగా యశ్వంత్‌రావ్‌తోపాటు గ్రామ పటేల్ పెందూర్ భగవంత్‌రావును కలిసి పలు అంశాలపై చర్చించారు. ఎంపీటీసీ మడావి భీంరావ్, కెస్లాపూర్ మాజీ సర్పంచ్ మెస్రం నాగ్‌నాథ్,ఆలయ పూజారి షేకు పాల్గొన్నారు.



పెద్దమ్మ తల్లికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

## ఆధ్యాత్మిక మార్గంలో నడవాలి

**-బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్**

బోథ్, మార్చి 22: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక మార్గంలో నడవాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పిలుపునిచ్చారు. కౌట(బీ) గ్రామంలో పెద్దమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమానికి శుక్రవారం హాజరయ్యారు. పెద్దమ్మ తల్లికి పూజలు చేశారు. ఆధ్యాత్మిక మార్గంతో మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. నియోజకవర్గ ప్రజలు పాడి, పంటలతో ఆయురారోగ్యాలతో చల్లగా ఉండాలని అమ్మవారిని వేడుకున్నారు. ఎంపీపీ తుల శ్రీనివాస్, జడ్పీటీసీ సభ్యురాలు సంధ్యారాణి, బీఆర్‌ఎస్ మండల కన్వీనర్ నారాయణ రెడ్డి, ఏఎంసీ మాజీ రుక్మాన్ సింగ్, తాజా మాజీ సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు బీ శ్రీధర్ రెడ్డి, ముదిరాజ్ సంఘం సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

### భక్తిశ్రద్ధలతో శ్రీ శబరిమాత విగ్రహ ప్రతిష్ఠాపన...

మండలంలోని కన్గుట్ట గ్రామంలో శబరిమాత విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ప్రత్యేక పూజల అనంతరం అమ్మవారి విగ్రహానికి వేదపండితులు ప్రాణ ప్రతిష్ఠ చేశారు. ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు, కన్గుట్ట గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.



ఇత్తడి కళాకారుడు ఇంద్రజిత్‌తో మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షి షా

## సాధారణ ప్రసవాలు పెంచాలి

**-ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా**

తాంసి, మార్చి 22: పీహెచ్‌సీల్లో సాధారణ ప్రసవాలు పెంచాలని కలెక్టర్ రాజర్షి షా సూచించారు. తాంసి పీహెచ్‌సీ, పోలింగ్ కేంద్రాలను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా తాంసిలో ని పోలింగ్ కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఓపీని పెంచాలని వైద్యులకు సూచించారు. తహసీల్దార్ లక్ష్మి, మండల వైద్యాధికారిణి శ్రావ్యవాణి, ఎస్‌ఐ శివరాం పాల్గొన్నారు.

### అవగాహన కల్పించాలి

భీంపూర్, మార్చి 22: గిరిజన ప్రాంతాల్లో పిల్లలు,మహిళల్లో రక్తహీనతపై మరింత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని కలెక్టర్ రాజర్షిషా అన్నారు. భీంపూర్ మండలం బేల్సరిరాంపూర్‌లో పర్యటించారు. గ్రామం బయట ఉన్న పోలింగ్ స్టేషన్‌ను మండల పరిషత్ పాఠశాలకు మారుస్తున్నట్లు తెలిపారు. బడి, అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. పిల్లలు, సిబ్బందితో మాట్లాడారు. ఎంపీపీ కుడిమెత రత్నప్రభ విన్నపం మేరకు రాష్ట్రస్థాయి ఇత్తడి కళాఖండాల కళాకారుడు ఇంద్రజిత్ ఇంటికి కలెక్టర్ వెళ్లారు. కళాఖండాలు పరిశీలించారు. ఇంద్రజిత్‌ను అభినందించారు. ఈ కళాఖండాలు అమెజాన్‌లాంటి వేదికల్లో ఉంచాలని సూచించారు. విశ్వకర్మ పథకం కింద ఆయనకు లబ్ధి కోసం దరఖాస్తు చేయాలని కార్యదర్శి సాయిని ఆదేశించారు. తహసీల్దార్ నారాయణరావు, ఎంపీడీవో గోపాలకృష్ణారెడ్డి, ఆర్‌డబ్ల్యూస్ జేఈ చంద్రశేఖర్, హెచ్‌ఎం వెంకటేశ్, వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు తదితరులున్నారు.

## రహమాబీకి పింఛన్

**ఆదేశాలిచ్చిన న్యాయసేవాసంస్థ**

ఎదులాపురం, మార్చి 24: ఆదిలాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన ఓ వితంతువుకు న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాలతో పింఛన్ మంజూరైంది. పట్టణంలోని రాంనగర్‌లో నివాసం ఉంటున్న రహమాబీ భర్త 2011 నవంబరులో గుండెపోటుతో మృతి చెందాడు. ఈమెకు నలుగురు కొడుకులు. నిరేపేద కుటుంబం, బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రూ.1000 చొప్పున ఆమెకు పింఛన్ మంజూరు చేసింది. కొంత కాలం తర్వాత ఆగిపోయింది. పింఛన్ ఇప్పించాలని కార్యాలయాల చుట్టూ తిరిగినా అధికారులు స్పందించలేదు. దీంతో 2023 జూలైలో ఆదిలాబాద్ జిల్లా న్యాయసేవాధికార సంస్థను ఆశ్రయించింది. డీఎల్‌ఎస్‌ఏ క్షమాదేశ్‌పాండే ఆదేశాల మేరకు ఆమెకు మార్చి 23న ఆదిలాబాద్ డీఆర్‌డీఏ అధికారులు రమమాబీకి పింఛన్ మంజూరు చేశారు. తన ఖాతాలో నగదు జమ చేశారు. కాగా పింఛన్ మంజూరు పత్రాలను శుక్రవారం తన కార్యాలయంలో డీఎల్ ఎస్‌ఏ కార్యదర్శి క్షమాదేశ్‌పాండే, డీఆర్‌డీఏ ఏపీవో (పింఛన్ విభాగం) జాదవ్ శేష్‌రావు లబ్ధిదారు రహమాబీకి అందజేశారు. రంజాన్ మాసంలో తనకు పింఛన్ వచ్చిందని రహమాబీ ఆనందపడుతున్నది.


# ఓటే వజ్రాయుధం

● జిల్లాలో కొనసాగుతున్న అవగాహన కార్యక్రమాలు ● కొత్త ఓటర్ల నమోదుకూ అవకాశం ● వచ్చే నెల 14 వరకు చాన్స్




ఆదిలాబాద్‌లోని గిరిజన గురుకుల డిగ్రీ కళాశాలలో ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తున్న కళాకారులు(ఫైల్)

ఆదిలాబాద్, మార్చి 22 ( నమస్తే తెలంగాణ): పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో జిల్లా అధికారులు విస్తృతంగా ఓటరు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. స్వీప్ (సిస్టమాటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్ట్రోరల్ పార్టిసిపేషన్) ద్వారా ఓటు హక్కు వినియోగం, నమోదు తదితరాలపై అవగాహన కల్పిస్తున్నారు. ఐదేండ్ల పాటు పాలించే ప్రజాప్రతినిధిని ఎన్నుకునేందుకు రాజ్యాంగం ఓటు హక్కును కల్పించింది. ఎన్నికల్లో ప్రజలు సరైన నాయకుడిని తమ ఓటు ద్వారా ఎన్నుకుంటారు. ప్రజాస్వామ్యంలో ఓటు చాలా విలువైనది. పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ వెలువడినప్పటి నుంచి అధికారులు ఓటరు నమోదు, వినియోగంపై విస్తృతమైన అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. లోక్‌సభ ఎన్నికలు రాష్ట్రంలో మే 13న జరుగనుండగా కేంద్ర ఎన్నికల సంఘం ఏప్రిల్ 1 నాటికి 18 ఏండ్లు నిండిన వారు ఓటరుగా నమోదు చేసుకునే అవకాశం కల్పించింది. ప్రజలు ఓటరు జాబితాలో తమ పేర్లు ఉన్నాయో లేదా బీఎల్‌వోలను అడగాలని, ఆన్‌లైన్‌లో కూడా చూసుకునే అవకాశం ఉందని చెబుతున్నారు. లేకపోతే ఫారం-6 ద్వారా కొత్త ఓటరుగా నమోదుచేసుకునే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ఏప్రిల్ 14వ తేదీ వరకు ఈ అవకాశం ఉందని చెప్పారు. ఎన్నికల సంఘం ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం ఓటరు జాబితాను ఇటీవల విడుదల చేసింది. లోక్‌సభ నియోజకవర్గం పరిధిలో మూడు జిల్లాల పరిధిలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు ఆదిలాబాద్, బోథ్, నిర్మల్, ముథోల్, ఖానాపూర్, సిర్పూర్, ఆసిఫాబాద్ ఉండగా 16,44,715 మంది ఓటర్లు ఉన్నారు. పురుషులు 8,02,575 మంది, మహిళలు 8,42,054, ఇతరులు 86 మంది, 2085 మంది సర్వీస్ ఓటర్లు ఉన్నారు. పోలింగ్ నిర్వహణలో భాగంగా 2111 పోలింగ్ కేంద్రాలు ఉండగా, మరో 80 ఆక్సీలరీ పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. ఒక్కో పోలింగ్ కేంద్రం 2 కిలోమీటర్ల పరిధిలో ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు. 85 ఏండ్లు దాటిన వృద్ధ ఓటర్లు, దివ్యాంగులు తమ ఇంటి వద్ద నుంచి ఓటును వినియోగించుకునే సౌకర్యం కల్పిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఓటర్లందరూ మే 13న జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని అధికారులు కోరుతున్నారు.





అధికారులతో సమీక్షలో మాట్లాడుతున్న నిర్మల్ కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

## తాగు నీటి కొరత లేకుండా చూడాలి

**నిర్మల్ కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్**

నిర్మల్ టౌన్, మార్చి 22: వేసవి నేపథ్యంలో జిల్లాలో తాగునీటి సమస్య తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని నిర్మల్ కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా అధికారులతో తాగునీటి ఎద్దడి, గ్రామాల్లో పన్నుల వసూళ్లపై శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఇప్పటికే గుట్టమీది ప్రాంతాల్లో తాగునీటి ఎద్దడి ప్రారంభమైందని మిషన్ భగీరథ ద్వారా ప్రతి ఆవాసానికి నీరందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. బోర్లు, చేతిపంపులు చెడిపోతే మరమ్మతులు చేయించాలన్నారు. అధికారులు గ్రామాలను సందర్శించి సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించాలని కోరారు. గ్రామాల్లో మార్చి 31వరకు అన్ని రకాల పన్నులు వసూలు చేయాలని ఆదేశించారు. పన్నుల వసూళ్లలో జాప్యం చేయవద్దని, అధికారులపై చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, డీపీవో శ్రీనివాస్, మిషన్ భగీరథ ఈఈ సందీప్ తదితరులున్నారు.

### పౌష్టికాహారం అందించాలి

లోకేశ్వరం, మార్చి 22: అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే వారికి పౌష్టికాహారం అందించాలని కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ అంగన్‌వాడీ సిబ్బందిని ఆదేశించారు. లోకేశ్వరం అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. దీంతో పాటు అంతర్ జిల్లా చెక్‌పోస్టు , పోలింగ్ బూత్‌లు, తహసీల్, ఎంపీడీవో కార్యాలయాలు, ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రంలో విద్యార్థుల గైర్హాజరుపై ఆరా తీశారు. మండల కేంద్రంలోని పాఠశాలలో అపరిశుభ్ర వాతావరణంపై అసహనం వ్యక్తం చేశారు. చెక్‌పోస్టు వద్ద తనిఖీలు ముమ్మరంగా చేయాలని సూచించారు. వివిధ కార్యాలయాలతో పాటు నర్సరీని పరిశీలించారు. భైంసా ఆర్డీవో కోమల్ రెడ్డి, తహసీల్దార్ మోతీరాం, ఎంపీడీవో సాల్మన్ రాజు, ఐసీడీఎస్ సీడీపీవో శ్రీమతి, సూపర్‌వైజర్ శ్రీ లక్ష్మి ఉన్నారు.




లోకేశ్వరం : పంచగుడి చెక్‌పోస్టు వద్ద అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

# మహిళా సౌరభం

● స్వశక్తి మహిళా సంఘాలకు సౌర విద్యుత్ ● సబ్సిడీతో కూడిన స్త్రీనిధి రుణం మంజూరు
● విద్యుత్ భారం తగ్గించేందుకు సోలార్ ● ఇంటిపైన ప్లేట్స్ ఏర్పాటునకు ప్రోత్సాహం

దిలావర్‌పూర్, మార్చి 22 : విద్యుత్ వినియోగం క్రమంగా పెరుగుతున్నది. పేద, మధ్య తరగతి కుటుంబాలు కరెంటు బిల్లు కట్టలేక ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారు. దీనికితోడు విద్యుత్‌ను పొదుపు చేయడం, షాక్ మరణాలను తగ్గించడం, ఖర్చులను దృష్టిలో పెట్టుకుని రాష్ట్ర ప్రభుత్వం సౌర విద్యుత్ ఉత్పత్తిని ప్రోత్సహిస్తున్నది. ముందుగా గ్రామీణ ప్రాంతాల్లోని స్వయం సహాయక సంఘాల(ఎస్‌జీహెచ్) సభ్యులకు అందించాలని నిర్ణయించింది. ఇందులో భాగంగానే నిర్మల్ జిల్లాలో 605 యూనిట్లను ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టింది. వీటిని మండలాలవారీగా అందించడానికి ప్రణాళికలు రూపొందించింది. గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో సోలార్ కరెంట్ వినియోగంపై అవగాహన సదస్సులను కూడా నిర్వహిస్తున్నారు.

### సబ్సిడీతో స్త్రీనిధి రుణం

మహిళా సంఘంలో సభ్యురాలుగా ఉండి అర్హులైన సభ్యురాలికి డీఆర్‌డీఏ ద్వారా స్త్రీనిధి రుణం అందించాలని ప్రభుత్వం సంకల్పించింది. రుణం తీసుకున్న సభ్యురాలికి ప్రతినెలా వాయిదా పద్ధతిలో చెల్లించే అవకాశం కల్పించింది. ఇంటి అవసరాల కోసం నెలకు 150 యూనిట్ల నుంచి 250 యూనిట్ల కరెంటు సరిపోతుంది. దీనికిగాను ఒక్కో కుటుంబానికి 2 కిలోవాట్ల సోలార్ ప్లాంటు ఏర్పాటు చేస్తే రోజుకు 8 యూనిట్ల సోలార్ విద్యుత్ ఉత్పత్తి అవుతుంది. 3 కిలో వాట్ల సామర్థ్యం కలిగిన యూనిట్‌ను ఏర్పాటు చేసుకుంటే రోజు 12 యూనిట్ల సోలార్ కరెంట్ ఉత్పత్తి అవుతుంది. దీంతో ప్రభుత్వం 2,3 కిలో వాట్ల సామర్థ్యం గల సోలార్ కరెంట్‌ను అందించేందుకు ముందుకొచ్చింది. ఇప్పటికే పలు మండలాల్లో ఈ పనులు జరుగుతున్నాయి. కాగా.. నిర్మల్ జిల్లాలోని ఎస్‌జీహెచ్ సభ్యులు వీటిని ఏర్పాటు చేసుకున్నారని నిర్మల్ డీఆర్‌డీవో విజయలక్ష్మి తెలిపారు.



ఇంటిపైన ఏర్పాటు చేసుకునే సోలార్ ప్లేట్స్



సోలార్ పవర్‌కు సంబంధించిన వస్తువులు

### సబ్సిడీ యూనిట్ల వివరాలు

| యూనిట్ కెపాసిటీ | 2 కిలోవాట్లు | 3 కిలో వాట్లు |
|---|---|---|
| ప్రాజెక్ట్ విలువ | రూ. 1.42 లక్షలు | రూ.1.92 లక్షలు |
| సబ్సిడీ | రూ.39,200 | రూ.57,360 |
| దరఖాస్తు రుసుం | రూ. 2,360 | రూ.3,450 |
| నెట్ మీటర్ చార్జీలు | రూ.2,950 | రూ.2,950 |
| స్త్రీనిధి రుణం | రూ. లక్ష | రూ.1.25 లక్షలు |
| సభ్యురాలి వాటా | రూ. 3 వేలు | రూ.10 వేలు |
| నెల వారి వాయిదా | రూ.2,248 | రూ.2,803 |

**లాభాలు..**

- ఉత్పత్తి అయిన మిగులు విద్యుత్తును గ్రిడ్‌కు సరఫరా చేసి అవసరానికి వాడుకోవచ్చు.
- పెట్టుబడి ఐదేండ్లలో తీరిపోతుంది.
- సోలార్ ప్యానల్ వారంటి 25 ఏండ్లు.



పాల శీతలీకరణ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్

## నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

కుంటాల, మార్చి 22: మండలంలోని కల్లూర్‌లో రూర్బన్ పథకంలో భాగంగా రూ.40 లక్షలతో నిర్మించిన పాలశీతలీకరణ కేంద్రాన్ని అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ శుక్రవారం తనిఖీ చేశారు. నిత్యం రెండు వేల లీటర్ల సామర్థ్యం గల పాలను శీతలీకరణ చేసే ఈ వసతిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అలాగే అంబకంటిలో హైమాస్ట్ లైట్లు, అంబకంటి తండాలో శ్మశానవాటిక, నర్సరీ ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నాణ్యతా ప్రమాణాలు పాటించాలని కాంట్రాక్టర్లు, అధికారులకు సూచించారు. ఎంపీపీ గజ్జారాం, విజయ డెయిరీ డీడీ మధుసూదన్ రావు, డీఈ సురేశ్, ఏఈ రఘువంశీ, జిల్లా డెయిరీ మేనేజర్ దస్రూ నాయక్, ఎంపీడీవో, ఏపీఎం, ఏపీవో ఉన్నారు.

## రూ.2 లక్షలు పట్టివేత

**-సీజ్ చేసిన పోలీసులు**

నిర్మల్ అర్బన్, మార్చి 22: నిర్మల్ పట్టణంలో శుక్రవారం పోలీసులు ఓ వ్యక్తి నుంచి రూ. 2లక్షలు పట్టుకున్నారు. పట్టణానికి చెందిన వంశీ వద్ద ఈ నగదును పోలీసులు శుక్రవారం రాత్రి స్వాధీనం చేసుకున్నారు. స్థానిక వివేక్ చౌక్ వద్ద పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. ఇదే సమయంలో బైక్‌పై వస్తున్న వంశీని ఆపి, సోదా చేయగా నగదు లభించిందని పోలీసులు తెలిపారు. సరైన పత్రాలు లేకపోవడంతో నగదును సీజ్ చేసినట్లు తెలిపారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో సరైన పత్రాలు లేకుండా నగదును తరలించవద్దని తెలిపారు. అత్యవసర సమయాల్లో సరైన పత్రాలు వెంట ఉంచుకోవాలని సూచించారు.

## విధుల్లో అప్రమత్తంగా ఉండాలి



సీఐతో మాటడుతున్న నిర్మల్ ఎస్పీ జానకీ షర్మిల


తానూర్,మార్చి 22 : ఎన్నికల నేపథ్యం లో పోలీస్ సిబ్బంది విధుల్లో అప్రమత్తం గా ఉండాలని ఎస్పీ జానకీ షర్మిల సూ చించారు. తానూర్ పోలీస్‌స్టేషన్‌ను శుక్రవారం తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. పెండింగ్ కేసులు లేకుండా చూసుకోవాలని సూచించారు. అనంతరం జవులా(బీ) బెల్‌తరోడ చెక్ పోస్టులను తనిఖీ చేశారు. వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని సూచించారు. ఎన్నికలు పూర్తయ్యే వరకు అంతర్రాష్ట్ర చెక్‌పోస్టుల వద్ద సిబ్బంది విధుల్లో ఉంటారని, సోషల్ మీడియా పై ప్రత్యేక నిఘా ఉంచాలని ఆదేశించారు. ఏఎస్పీ కాంతిలాల్‌పాటిల్, ముథోల్ సీఐ మల్లేశ్, ఎస్‌ఐ లోకం సందీప్ ఉన్నారు.

### కుంటాలలో..

కుంటాల, మార్చి 22: మండలంలోని దౌనెల్లి తండా చెక్‌పోస్టును ఎస్పీ జానకీ షర్మిల శుక్రవారం తనిఖీ చేశారు. వాహనాల తనిఖీలను పరిశీలించారు. సీజ్ చేసిన నగదు, మద్యం వివరాలు అడిగి తెలుసుకున్నారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను సందర్శించి రికార్డులు, ఆవరణను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఎస్‌ఐ రజినీకాంత్, ఏఎస్‌ఐ దేవరావు, సిబ్బంది ఉన్నారు.

## ఆర్జీయూకేటీలో వెబ్‌నార్

బాసర, మార్చి 22 : బాసర ఆర్జీయూకేటీలో మేధోసంపత్తి హక్కులపై శుక్రవారం వెబ్‌నార్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పవన్‌కుమార్, సీనియర్ సైంటిస్ట్ సీఎస్‌ఆర్ భువనేశ్వర్, డాక్టర్ కపిల్ ఆర్య, ప్రిన్సిపాల్, సైంటిస్ట్ సీఎస్‌ఐ ఆర్ న్యూఢిల్లీ పాల్గొని ప్రసంగించారు. పేటెంట్ హక్కుల ప్రాముఖ్యత, వాటి రూపాలను ఉదాహరణ పూర్వకంగా వివరించారు. సైక్లింగ్ చేస్తూ వాషింగ్ మెషిన్‌ను ఉపయోగించి పేటెంట్ పొందిన ఒక సాధారణ వ్యక్తి గురించి వివరించారు. ఒక ఆలోచన వ్యక్తిని, సమాజాన్ని దీంతో దేశాభివృద్ధిని ఏ విధంగా సాధించగలమో వివరించారు. డా. కపిల్ ఆర్య మాట్లాడుతూ మేధో సంపత్తి పత్రాలను పూరించి పేటెంట్ కిందికి రాదనే అంశాలను పేర్కొన్నారు. ప్రత్యేకాధికారి సృజన, ఆర్గనైజింగ్ మెంబర్ సృజన, స్వాతి, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.



వెబ్‌నార్ నిర్వహిస్తున్న దృశ్యం